# వేసవి పగలు

## 1

ప్లీడరు గారి యింటిదగ్గర్నించి తిరిగొచ్చిన సీతయ్య కర్రపెట్టెని గబగబా తెరిచి, అందులో బట్టల్ని చిందరవందరగా విసిరేసి, అడుగున ఉన్న చిన్న తాటాకు పెట్టెని తీశాడు. కూతురు రామి దీపంబుడ్డి పట్టుకుని నుంచుని, అంతా అర్థం కాకుండా చూస్తోంది.

తాటాకు పెట్టెలో చిల్లరంతా లెక్కపెడితే ఆరురూపాయలు తేలింది.

"ఇప్పుడెందుకు ఆ డబ్బు?"

కూతురడిగింది. రూపాయిలవైపు శూన్య దృష్టుల్ని ప్రసరిస్తున్న సీతయ్యకి ఆ ప్రశ్న బాహ్య ప్రపంచపు స్ఫురణ కలిగించింది.

"ఎందుకా? ఆయనకీ కిందటినెల బాకీ బాపతుడబ్బు తక్షణం యివ్వాలిట! లేకపోతే రేపట్నించి రిక్షా కిరాయికిచ్చేది లేదన్నాడు".

బుడ్డికింద పెట్టి రామి పక్కగా కూచుంది.,

"పోనీ వేసవికాలం వెళ్ళాక తీర్చుకుంటామని చెప్పకూడదు?"

"అంతా అయింది. కాని ఆ మహానుభావుడు వినేలా లేదు. అందుకే అరగంటసేపు ఏకధాటిగా లెక్చరుకొట్టింది; నన్ను పిలిపించిందీని".

సీతయ్య వెతులకండల్ని చూసుకోసాగాడు, అవి కష్టంలో కరిగిపోయాయో, గట్టి పడ్డాయోనని.

"పోనీ సగమిచ్చెయ్యి. తలమీదికి గుడ్డా కాళ్ళకి చెప్పులూ లేకపోతే ఎండలో ఎట్లా బాధపడ్తావ్?"

ఆలోచన బాగానేవుంది. కాని సీతయ్య ప్రయత్నాలన్నీ నీళ్ళు కారాకనే, యింటికి వచ్చాడు.

"ఏదో పిచ్చిగాని, నేను ఆ ప్రయత్నం చెయ్యలేదనుకున్నావా, అమ్మాయ్? కాని ఆ బ్రాహ్మడు అంగీకరిస్తేగా! ముందు ఆ బాకీ అక్కడపెట్టి, రేపు రిక్షామీద చెయ్యి వెయ్యి అన్నాడు".

"మరి తలగుడ్డా, జోళ్ళ మాట?"

"ఆ సంగతి నే చూస్తాన్లే!"

బట్టలు మళ్ళీ సర్ది, డబ్బు సంచిలో పెట్టుకుని, బయలుదేరాడు, సీతయ్య.

రామి మాత్రం నిస్సహాయత తెలియజేస్తున్న చూపులతో అతన్ని సాగనంపింది.

దారిలో సీతయ్య అనుకున్నాడు:

"వీళ్ళకి కృతజ్ఞత వుండదు. మనుషుల్ని నమ్మలేరు, అసలు వాళ్ళమీద వాళ్ళకే నమ్మకం తక్కువ. ఇంక యితరుల్నెలా నమ్ముతారు? నేను కష్టాన్నైనా సహిస్తానుగాని, మాట పడలేను"

## 2

వేసవికాలం! అప్పుడే రోహిణీకార్తి ప్రవేశించింది.

సుకుమార్ శరీరులైన ధనికులుకూడా మహాకష్టపడుతున్నట్లు చెమటిల్ని గక్కుతున్నారు.

కానీ యిళ్ళల్లో వాళ్ళకి తగినసదుపాయాలు లేకపోలేదు. ఎలక్ట్రిక్ ఫాన్లూ, వొట్టివేళ్ళ తెరలూ, ఇంటిలోకి ఎండని రానియ్యకుండా తరుముతున్నాయి. ప్రపంచమంతా అంత చల్లగానూ ఉన్నట్టు అనుకుంటున్నారు. పదింటికీ, పన్నెండింటికీ, మూడింటికీ వచ్చి నీళ్ళతో కుర్రాడు వట్టివేళ్ల తెరల్ని తడపకుండావుండడు. ఇది అదృష్ట జీవుల సంగతి మాత్రమే!

కాని కోట్లాది దురదృష్ట జీవులు లోకంలో లేకపోలేదు. ఎండవానల్ని భరించమని దేవుడు సృష్టించాడు వాళ్లని. అదే అతడి వుద్యోగం. కాని యింత కష్టపడ్డా మామూలురోజుల్లో ప్రతిఫలం కంటె ఒక అణా అధికమివ్వడానికి, ఆ అదృష్ట జీవులు గుడ్లు మిటకరిస్తాయి. పర్సులమీదికి చేతుల్ని పోనివ్వవు.

మధ్యాహ్నం పన్నెండు గంటలయింది. పొద్దున్ననించి ఏదో కష్టపడి రిక్షా లాగాడుగాని యింక దాన్ని ముట్టుకోడం కష్టమనిపించింది సీతయ్యకి. కాని ఎంతగా ఎండకి అలవాటు పరుద్దామనుకున్నా, మొద్దుబారుద్దామనుకున్నా, ఇంకా ఎండ ఆ మోటుతనాన్ని చీల్చుకుని మంటపెడుతోంది.

సూర్యరశ్మి తల్లోకి చొచ్చుకుపోయి మెదడును కరిగిస్తున్నట్టుంది. వొళ్ళూ, కట్టుకున్న చిన్నిగుడ్డాకూడా చెమటతో తడిసిపోతున్నాయి. ఎంతగా చెమటని తుడుచున్నా మళ్ళీ, అంతులేని ప్రవాహంలా అది పైకి వుబికి వస్తోంది.

అప్పుడే స్టేషనునించి ఒక సవారీని ఇంటి దగ్గర దిగబెట్టిన సీతయ్య ఒక్కసారిగా ఏదో పెద్ద ఒగర్పునీ, ఆయాసాన్నీ పొందాడు. తలలో శూలాల్తో పొడుస్తున్నట్టు పోటుకలగసాగింది. గుండె వేగం కూడా అధికమైనట్టనుకున్నాడు. ఎదట చూస్తున్న వస్తువులు ఏవో నీటిలో వస్తువుల్లా వంకరటింకరగా వున్నట్టు కనపడసాగాయి. చేతులు రిక్షాగంటని అనవసరంగా, అనాలోచితంగా ఒకసారి వాయించాయి.

పక్కనే వున్న మర్రిచెట్టుకిందికి కాలుతున్న కాళ్ళు అనుకోకుండానే పోయాయి. రోడ్డుకి పక్కగా రిక్షాని నిలిపి, చెట్టు దగ్గర కూచున్నాడు. ఒక నిమిషం విశ్రాంతికని. ప్రాణం లేని రిక్షా కూడా సానుభూతి పూర్వకమైన విచారాన్ని తెలుపుతున్నట్టనిపించింది. అతనికి.

'ఒక్క నిమిషం నువ్వు కూడా విశ్రాంతి తీసుకో. ఎండలో నీ టైర్లు కరుగుతున్నాయి కూడాను' అన్నాడు.

అప్పుడే వీచిన గాడ్పు గాలి చెట్టుక్రింద కొంచెం చల్లబడి అతని ఆవలింతలో మిళితమైపోయింది. అతని ఆయాసం కూడా కొంత తగ్గసాగింది. నడుం దానంతటదే చెట్టుకి జారగిల బడింది. ఎండవేడికి ఎర్రబడ్డ కళ్ళు రెప్పల వెనకాల దాగుతున్నాయి.

ఒక్క నిమిషంలో అతన్ని గాఢమైన నిద్ర ఆక్రమించుకుంది. మర్నాటి తిండి సంగతీ, యజమాని ఇవ్వాల్సిన అద్దె సంగతీ ఏమీ అతన్ని బాధించేవిగా లేవు.

అల్లా ఎంతసేపు నిద్రపోయాడో అతనికే తెలియదు.

## 3

బాగా చీకటి పడింది. నాన్నకోసం ఎదరురు చూసిన రామి కంగారు పడసాగింది. మధ్యాహ్నం గంజికి కూడా రాలేదేమా అనుకుంది.

వెతుక్కుంటో, వెతుక్కుంటో చివరకి ఈ చెట్టునీడని చేరుకుంది.

తండ్రి ఇంకా వొళ్ళు తెలియని నిద్రలోనే వున్నాడు. తన జన్మలో జ్ఞానం వచ్చాక నిద్దరపోవడం, అంత సంతుష్టికరంగా, అతనికి అదే మొదటిసారిగావును.

రోడ్డు పక్కగా వున్న రిక్షా చక్రం రోడ్డుపై విరిగి పడివుంది. రామికి కంగారెత్తింది.

ఏం జరిగింది? తండ్రేమయ్యాడు? ఏ ప్రమాదం రాలేదు కదా, కొంపతీసి?

ఎన్నో చెడ్డ ఆలోచనలు, లెక్కలేనన్నీ తలలో ప్రవేశించాయి.

కాని తండ్రి పడుతున్న గురక కొంచెం కంగారును పారదోలింది. కాని విరిగిన రిక్షా ఆత్రాన్ని అధికం చేస్తోనేవుంది.

"లే, నాన్నా, ఇక్కడ నిద్దరేమిటి? ఈ రిక్షా ఇలా అయిందేమిటి?"

తట్టి లేపసాగింది.

సీతయ్య కళ్ళు తెరచాడు ఒక నిమిషం ప్రపంచాన్నంతా కలియజూశాడు, ఏదో ఏ లోకంలోనించో అప్పుడే దిగినవాడిలా తర్వాత అన్నాడు:

"ఎవ్వరూ...? నువ్వా!!" లేచి నుంచున్నాడు. రామిమళ్ళీ అంది.

"ఈ నిద్దరేమిటి? ఈ రిక్షా ఏమిటి ఇలా అయింది'.

సీతయ్యకి అంతా అర్థమయింది.

తను నిద్దట్లో వున్న సమయంలో ఏలారీ అయినా డీ కొని వుంటుంది. కాని అతనికి విచారం కలగలేదు.

"పోనీలే... ఇంక ఎండలో రిక్షా లాగక్కర్లేదు. ఏ పల్లెటూరన్నాపోయి కూలిపని చేసుకుంటాను".

అమితమైన సంతోషంతో అన్నాడు!

కాని రామి యింకా అంటోంది:

"మరి అద్దెవాడిసంగతి? వాళ్ళకి రిక్షా ఇయ్యవద్దు?" అని.

కాని సీతయ్యకి ఆ మాటలు వినిపించడం లేదు.